
# కావేరి

## రాయసం వేంకటశివుఁడు గారు వ్రాసినది

తి.రా.

## ౧

సంవత్సరాదిసందర్భమున, మా ముఖ్యాధికారి సందర్శనమునకై పట్టణ మేగి, 'పార్కు' వేడుకలు చూచి, మరలి వచ్చునపుడు, బడలిక తీర్చుకొనుట కొక చెట్టునీడ నిలుచుంటిని. అనతిదూరమున నొక స్త్రీ కూర్చుండి, దీర్ఘవిచారమున మునిఁగినదానివలె నగపడెను. కొంతసేపటి కామె కనుగవనుండి చిన్న బాష్ప బిందువులు నేల రాలెను. దుఃఖ మాగక యా యంగన చక్షువులనుండి యశ్రుజలమంత నపరిమితముగ స్రవింప సాగెను. వేలకొలఁది ప్రేక్షకుల నానందమునఁ దేల్చెడి వేడుక లీసుదతి హృదయము నేల దుఃఖతోయముల ముంచెడినా యని నే నచ్చెరువంది చూచుచుండఁగా, దుర్భరశోకమున నామె మతి తప్పిపోవుదానివలె నయ్యెను. ఆపద బంధుత్వమును వెదకికొనెదు. చివాలున నే నా స్త్రీయొద్దకుఁ బోయి, "శోకింపకమ్మా! ఏమి నీ సమాచారము?" అని ప్రశ్నించితిని. మొదట నామాటలు వినకుండెడి యానవనితె, ఒకనిముసమునకుఁ గన్ను తెఱచి, "మీదారిని మీరు పొండయ్యా!" అని యతిసమున మెల్లఁగ ననెను. "చెప్పమ్మా నీసంగతి. నీ వతి విచారమున మునిఁగిపోవుచున్నావు. నిన్నోదార్చువా రెవ్వరును లేకపోవుటచేత నేను వచ్చినాను" అని పలికితిని. నామాటలు దుఃఖోపశమనము చేయుటకు మాఱుగ నా మానిని నంత మఱింత ప్రజ్వలింపఁజేసినను, కొంతసేపటి కామె కొకింత శాంతి సమకూర్చెను. ఇపు డా స్త్రీ దుఃఖము మాని, చీర చెఱఁగుతోఁ గన్నీరు తుడుచుకొని "కూర్చుం



డండి, నా దుఃఖకారణము దేవునికే యెఱుక! నా వెత లెవరు తీర్పఁగలరు?" అని మరల విలపింపఁబోఁగా నే నూఱడించి, తనసంగతి చెప్పుమని వేడితిని. ఆమె యపు డిట్లు చెప్పఁదొడంగెను:—

"దక్షిణాదిని మాయవరముదగ్గఱి మారంబాకము పుట్టినిల్లు. మాతండ్రి కావేరీతీరమున నొక గ్రామమున నుద్యోగమున నుండునపుడు నేను పుట్టినందున, నాకు


'కావేరి' యను పేరు పెట్టిరి. తలిదండ్రుల కల్లారు ముద్దుగఁ బెరుఁగుచున్న నాకు మంచి సంబంధము లభించుటచేత చిన్ననాఁడే పెండ్లియయ్యెను. కాని, వివాహమైన కొద్దికాలములోనే నా దురదృష్టవశమున భర్త చనిపోయెను. నాకు సంభవించిన విపత్తునకు బెంగపెట్టుకొని మాతల్లి యంత మృతినొందెను. నన్నును మా తమ్ములను ఒంటరిగఁ దాను బెంపఁజాలక, ఏండ్లుగడచినను మా తండ్రి రెండవమాఱు పాలఘాటు పిల్ల నొకతెను పెండ్లియాడెను. పాలఘాటుపడుచులు పరమధూర్తలు. కాఁపురమునకు వచ్చినప్పటినుండియు మా సవతితల్లికి నామీఁద సవతితల్లి ప్రేమయే! నా తమ్ములన్నను మొదటిరోజులలో నా పుణ్యవతి కల్లేయుండినను, ఈసడించి కొట్టు నామెనే 'అమ్మా! అమ్మా!' యని పిలచి వారంటిపెట్టుకొనియుండుటచేత కాఁబోలు, ఆపిల్లలయందే ప్రేమ పారెను! నాయందా యిల్లాలికి దయాలేశమును లేదు. నా కామెయందు నట్లే యుండెను. తల్లి మృతినొందిన కారణమున వచ్చిన మాఱుఁదల్లి మాతల్లి మృతికిఁ గారణమని నేఁ దలపోసి, ఆమెయందపరిమిత ద్వేషబుద్ధినూనియుంటిని. వయసుతోపాటు మా యిరువుర యన్యోన్యవైరము పెరిఁగెను. ప్రొద్దుననే వితంతువును జూచుట యశుభమని నన్నామె యేవగించుచుండును; సవతితల్లి మా కాగర్భశత్రువని నేను బరిగణించుచుండును. మా జగడములు పాపము మా నాయన మనశ్శాంతిని తొలఁగించెను. ఇరువురలో నెవరిని నిందించుటకును నోరు రాక, మాతండ్రి లోలోననే కుములుచుండెను. నేను బుద్ధిపాటవము గాంచినపిదప, ఈ గృహచ్ఛిద్రములకు నేనె నిమిత్తమని గ్రహించి, వైరబుద్ధి మరల్చుకొనవలెనని యెన్నో ప్రయత్నములు చేసితిని. కాని, మాసవతియమ్మ ముఖారవింద మెంత చిత్రమైనదోకాని, ఆమె కనులఁబడఁగనే, నన్ను వెఱ్ఱికోప మావహించుచుండును! నన్నుఁజూచిన నామెకు నదేవిధముగ నాగ్రహముప్పొంగుచుండును. ఇంక నాయింట మా యిద్దఱకుఁ బొత్తుగలియదని రూఢిపఱచికొని, ఆమె యచట నుండవలసినదే కావున, నేనే గృహము విడిచిపోవుట యుక్తమని యోజనచేసితిని. కాని, నే నెచటికిఁబోవుదును? మగఁడులేని యాఁడుబడుచు లెంత దురదృష్టవతులు! ఇట్టి స్థితిగతులలో నా కేది దిక్కు?

"నాతోఁ గయ్యము సలుపుచుండినపుడు, ఒక్కొకతఱి మా సవతియమ్మ నన్నుఁజూచి, 'పుట్టుకుంకవై పిశాచమువలె మము పీడింపక, ఏ వీరేశలింగము సాయమునదో మాఱుమనువు చేసికొని హాయిగ మనుచుండరాదా!' యని నన్ను దెప్పుచుండును. ఈ మాటలనుబట్టి, తెలుంగుదేశమున వీరేశలింగముపంతులు విధవావివాహములు జరిపించుచుండుట నాకుఁ దెలియవచ్చెను. అదృష్టవశమున నాకు మంచి వరుఁడు ప్రాప్తించినచో నా కష్టములు గట్టెక్కునని నేఁదలపోసి, ఒకనాఁడు మాతండ్రి 'కమాను' పోయినపుడు, రాత్రివేళ నిలు వెడలితిని. అత్తవారు పెట్టిన కొద్దినగలును నామూటలో వేసికొని, మఱి బయలుదేఱితిని.

"నాకు, 'వీరేశలింగము', 'గోదావరి', యను రెండుమాటలు తప్ప, ఉత్తరాది సంస్కర్తనుగూర్చి యపు డేమియుఁ దెలియదు. ఆప్రాంతములందలి భాష కూడ నాకు రాదు. ఎటులో రాజమండ్రి పురముచేరి, వీరేశలింగముగారి తోటలో పాదమిడితిని. ఆ మహనీయుని పాదముల కెరఁగి, నన్నొక యింటిదానిగఁ జేయుమని వేఁడితిని. ఆయన జాలి గుండెగలవాఁడు. కాని, బొత్తిగ తమిళ మెఱుఁగడు. కావేరమ్మాళు అను నా పేరె యాయనకుఁ నోటఁదిరుగదు! కొంచెము చదువుకొనినచో మంచి సంబంధము దిక్కునని యాయన చెప్పుటచేత, నా శక్తికొలఁది విద్యనేర్చితిని, కాని గుండ్రాళ్ళవంటి తెలుఁగు లిపిపట్టుపడునప్పటికే నాకు తలప్రాణము తోఁకకు వచ్చెను. ఇంక పిడుగురాళ్ళవంటి పదములుగల యా యన్యభాష నే నెట్లు నేర్వఁగలను? ఆఱునెలలైనను, నా చదువున మార్పేమియుఁ గలుగలేదు!

"ఒకనాఁటిమధ్యాహ్నము పంతులు నన్నుఁ బిలువనంపి, 'కావేరీ! నీకిఁక విద్య రాదు. చదువురానిదానికి చక్కని సంబంధమెట్లు సమకూరును? ఏదోయొకదానితో నీవు సరిపెట్టుకొనవలెను. ఇదిగో యీయనను జూచితివా?' యని నలువది వత్సరముల ప్రాయముగల యొక

వరునిఁ జూపెను. ఆయన కేయుద్యోగము లేకున్నను, కొంతభూవసతి గలదట. మశూచికపు మచ్చలు మొగము



నలుముకొని యుండెను. మెల్ల కన్నుకూడను! కొంచెమాలోచించుకొని మఱిచెప్పెదనని యప్పటికిఁ దప్పించుకొనిపోయి, ఆసాయంకాలమె పంతులను సందర్శించితిని. వరదలై ప్రవహించు కన్నీటి ధారలచే నేనాపూజ్యుని పాదపద్మములు కడిగితిని. నాకీసంబంధము పనికిరాదనియు, వేఱొకసంబంధము కుదుర్పుఁడనియు దైన్యముతో వేడితిని. దిక్కులేని నన్ను తనసొంతకూఁతునిగఁ జూచుకొమ్మంటిని. ఇంక కొంత గడువిచ్చినచో, ఎక్కువగఁ జదివి తనను మెప్పించెదనని పలికితిని. పంతులకు జాలికలిగె, 'సరే కావేరీ! చదువుచుండుము. నీ పెండ్లి మాట మందు చూతములే!' అని నన్నుఁ బంపివేసెను.

“నేను వ్రేళ్ల అరిగిపోవునట్లు దిద్ది, కనులు బొత్తలు పడునట్లు చదివినను, నావిద్యలో మార్పేమియుఁ గానఁబడలేదు! ఒకనాఁడు పంతులు నాకుఁ గబురుపంపి, 'కావేరమ్మా! మంచి సంబంధము వచ్చినది. నీ అదృష్టవశమున, వరుఁడు విద్యాధికుఁడు, ఉద్యోగస్థుఁడును. ఈ బ్రాహ్మసమాజమందు, వర్ణభేదములు పాటింపని వివాహములు జరుగుచుండునుకదా! వరునిది వేఱొందిన వెలమకులము. నీకీసంబంధము సమ్మతమని తలంతును!' అని చెప్పెను. వెంటనే నేను పంతులతో, 'బాబయ్యగారూ! చదువురాదని నన్ను కులము తక్కువవానికి కట్టఁబోకండి! శ్రమపడి నేనింతదూరము వచ్చినది శూద్రుని పెండ్లాడుటకుఁ గాదు సుమండీ! ఏమున్నను, లేకున్నను, బ్రాహ్మణునికే నన్నీయండి!' అని చెప్పివేసితిని. పంతులు ముంగోపి. ఈమాటలకాయన రౌద్రాకారుఁ డయ్యెను. 'కావేరీ! వచ్చి సంవత్సరమైనను, నీకు చదువేమి యంటలేదు—ఎట్టి సంబంధమును నీకు నచ్చుడము లేదు! ఎంత కాలము నిన్నీశరణాలయము భరించుననుకొన్నావు?' అనుపంతుల విసుగును దెలుపుమాటలకు నాకన్నుల నీరు గిఱ్ఱునఁ దిరిగెను. ఐనను, పంతులకు, వాక్కు కఠినమె గాని మనస్సు మెత్తనిది. నాకన్నీరు కనులఁ గాంచఁ జాలక, 'కావేరీ! నీకువచ్చిన ప్రమాదమేమియు లేదులే. నీయిష్టమువచ్చినవానికే నిన్నిచ్చెదనులే!' అని యాయన నన్నోదార్చి పంపివైచెను. ఇంకొకసారివచ్చిన సంబంధము తప్పక యొప్పుకొందునని నేను మనసున నిశ్చయించుకొంటిని.

“పిమ్మట నొకనెలకు మఱియొక సంబంధము వచ్చెను—ఇప్పటి వరుఁడు బ్రాహ్మణుఁడు. వెనుకటివానికంటె కులరూపములు గలవాఁడు. విద్యయంతగ లేకుండి స్వల్పయుద్యోగములోనున్నను, త్వరలో పైకి రాఁగలవాఁడు. నేను 'సరే' యంటిని.

౪

“ఆనందమున నంతజరిగిన మావివాహమునకు పెద్దలనేకులు వచ్చియుండిరి. పెండ్లియైన కొంతకాలము వఱకును మేమాపట్టణమున నొకచిన్నయింటఁ గాపురముంటిమి. నాపతికి సంబళము తక్కువయైనను, గొప్పవారి ప్రాఁపుగల మమ్ము పురములోని పెద్దలు సన్మానించుచు వచ్చిరి. నలుగురిలో తలయెత్తి తిరిగెడి భాగ్యమిన్నాళ్లకు నాకు పట్టినదిగదాయని యానందభరితనైతిని.

“కాని, మందభాగ్యుల కెచ్చటను, కావేరి వెల్లువవలె స్వల్పకాలములోనె సౌఖ్యసౌభాగ్యములు సమసిపోవుచుండును! నాపెనిమిటి తఱచుగ తనస్థితిగతులు తలపోసి దైన్య మొందుచుండును. జీతము జీవనమునకు

పరిపడకుండునని మొఱలిడుచుండును. ఎంత తక్కువ యాదాయములోనైన నే నిల్లుగడపెద నను నా ప్రతిన యాయనకు నచ్చదయ్యెను! ఆయన అందని మ్రానిపండ్ల కఱ్ఱులు సాచుచుండును!

*          *          *          *          *

"పరదేశముపోయి వేరువృత్తి నూనినఁ దన వెతలుడుగునని యాయన తలంచుచుండువాఁడు. ఒకనాఁడాయన ఎచటికో పోయి, ఎప్పటికిని తిరిగి రాకుండెను! విదేశీయను నేనేమి చేయఁగలను? ఈసూరదేశమున నాకు దిక్కెవ్వరు? దైవమువలెగాచెడి పంతులివల తీఱిపోయిరి.

"ప్రాణసంరక్షణమునకొఱకై సంపన్నగణాభిమానుల గుమ్మములకడ పడిగాపులుపడియుంటిని. తుదకు నారాక కంటక ప్రాయమై, ఇంటలేరనియు, తీరికలేదనియు, వారు నన్ను విసరికొట్టుచుండిరి! ఒక పేద బ్రాహ్మణి నామీఁద జాలిగొని, ఉపాదానము చేసికొని జీవింపరాదా యని బోధించెను. ఐనను, నాతిరిపమునకే విఘ్నము వాటిల్లెను! బలిష్ఠులగు పసుచులకు బిచ్చమేల? యని చేరెడు బియ్యము వేయుట కన్నులకెఱ్ఱలు విసిగికొనుచుండిరి. 'నీళ్లు మోసికొనరాదా?' యని కొందఱును 'వంటకుకుదరఁగూడదా?' యని కొందఱును, హితోక్తులు పలుకుచుండిరేకాని, పురుషాహితవను నావృత్తాంతమెఱిఁగిన వారెవరును నన్నీపనులకు నియమింపనొల్లరు కదా?

౫

"ఎంతకాలమునకును నా పెనిమిటి సమాచారము తెలియకుండెను. ఇట్లు రెండవతూరి యనాథనైన నాకు దినములుగడచుట దుస్తరముకాగా, గోదావరియొడ్డున మొదలియారి యొకఁడు నాకన్నుల కగఁబడెను. అతని యభయమాటలు నావీనుల కమృతప్రాయ మయ్యెను. కావేరీతీరమున బంధువులతోఁడి పూర్వపుసుఖదినములు నాకు జ్ఞప్తికివచ్చెను. ఏకాకినగు నాకీశూద్రకులజుఁడే సోదరుఁడయ్యెను. నాపురోవృద్ధిగోరు ప్రియమిత్రునివలె నాతఁడు నన్నోదార్చినపుడు, నానయనములనుండి యానందాశ్రువులు సరదలై పాఱెను! రాజమహేంద్రవరమున తానుండిన వారముదినములును, అతఁడు నాయింటికివచ్చుచు, నాకు దుఃఖోపశమనము గావించుచుండెను. విదేశమున దుస్థితినున్న నా కేకైకశరణ్యమైన యీపురుషుని వాక్యమె నాకు వేదవాక్యమయ్యెను. ఆతనిపలుకులు నేచెవియొగ్గవిని, యవి విశ్వసించి, వాని చొప్పున నడువ సిద్ధముగనుంటిని.

"చెన్నపురిలోఁ దనకుఁ బెద్దసంసారము గలదనియు, అచట నేను సుఖజీవనము చేయవచ్చుననియు వాఁడు నన్ను నమ్మించెను. నాకీతఱుణమునఁ గావలసిన దిట్టి సాయమేకదా! తిరిగి పుట్టినింటికిఁబోయిన, బంధువు లీసడింతురని నేనీతనితో పట్టణమునకుఁ బయనమైతిని. నాసగ్గుఁ సొమ్మేమియును లేకుండుటచేత, నా ప్రయాణపుఖర్చులు మొదలియారియె భరించెను. రెయిలు దిగినతోడనె నన్నాతఁడు తనపెండ్లాము పిల్లలయొద్దకుఁ గొనిపోవునని నేనెంచితిని. కాని యాతఁడట్లు చేయలేదు. పరుల పెట్టుపోతల కాశించి, వారిచే నీసడింపఁ బడుచుండక, స్వతంత్రజీవనము చేయుట యందాసక్తిగల స్త్రీనని యెఱిఁగియె తానిట్లు చేసితినని మొదలియారు చెప్పినపుడు, వాని బుద్ధికుశలతను గొనియాడితిని. కాని,




"మొదలియారి యొకడు నాకన్నుల కగపడెను."

యీమహాపట్టణమున స్వపోషణము నేనెట్లు చేసికొనఁగలను? మొదల్యారు నిజముగ పరోపకారచింతయె గలవాఁడైనచో, స్వల్పకాలమైన నాకుఁ దనయింటనే సహాయముచేయఁడా? ఎప్పటికప్పుడు నాజమాఖర్చులు తేల్చుచుండుటను బట్టియె, సొమ్మువిషయమై యాతనిది గట్టిపట్టని నేగ్రహించితిని. ఒకవేళ నన్నే గోతిలోనైనఁ ద్రోసి, తానందుమూలమున లభమునొందఁ గోరుచున్నాఁడా? ఏమనుకొనుటకును, ఏమి చేయుటకను, నాకుఁ దోఁచకుండెను. ప్రాయమువచ్చిననా కీతఁడే ద్రోహముచేయ సాహసించునా? ఎపుడు వీనిదురుద్దేశము సూచితమగునో, ఆక్షణమందే వీనిని విడనాడవచ్చును గదాయని తలంచి, ప్రమత్తనై నేను పట్టణమందుంటిని.

౬

పట్టణముచేరిన యొక నెలయినను, నాకొక యింట చిన్నగదియొకటి మొదలియారు కుదిర్చిపెట్టెను. ఆనెలకుఁ గావలసినసొమ్ము కూడ తానే పెట్టుబడిపెట్టెను. రెయిలుకర్చులకును, మొదటినెల వ్యయముల కును, నూఱు రూపాయ లాతఁడు లెక్కచెప్పెను. ఈసొమ్మునకు నాచే నోకపత్రము వ్రాయించుకొనెను. ఈవిధముగా మూఁడునాలుగు నెలలు గడచెను. నామీఁద నిన్నూఱు రూపాయ లిపుడు బాకి తేల్చి, సొమ్మియమని యతఁడు నన్నొత్తుడుచేసెను. నేనెట్లు వాని యప్పు తీర్పఁగలను? నాకేదైన వృత్తిచూపించి, తనబాకి రాఁబట్టుకొమ్మని నేనఁగా, ఏదో, దీర్ఘాలోచనలో మునిఁగినవానివలె మొదల్యారు మౌనముతోఁ గొన్నిదినములు గడపెను. నేనెన్నిసారులు కోరినను నాకుఁ దనవారిని జూపింపకుండుటయు, ఎక్కువ వడ్డికట్టి నాబాకి పెంచుచుండుటయుఁ జూచి, యీతనితీరు బాగుగ లేదని నేభ్రమిల్లితిని. ఐన నేనీతని వలనుండి తప్పించుకొనుట ఎట్లు? నాచిన్నచిన్న నగలిదివఱకే యమ్మివైచితిని. తలిదండ్రులకే నాబాధ్యత లేనపుడు, లోకములో నెవ్వరీసమయమున నాకుఁదోడుపడి, నాయప్పు లచ్చుకొందురు?

"ఎట్టకేలకు, మొదలియారి యోజనలు విశదమయ్యెను. తన యప్పుచెల్లింపుమని యతఁడు మరల నన్ను నిర్బంధించెను. నా వృత్తిమాట జ్ఞాపకముచేయఁగా, 'మీరే యాలోచించుకొనండి!' యని యతఁడు చెప్పివేసెను. కొన్నిదినములనుండి నన్నుఁజూచుట కతని ప్రేరణముచే నొకరిద్దఱు స్త్రీలు నాబసకువచ్చి, నాతో మాటాడి పోవుచుండిరి. నా వలెనే మొదట దారిద్ర్య




మనుభవించి పిదప ధనికురాండ్రైన స్త్రీలను దామెఱుఁగుదుమని వారు చెప్పుచువచ్చిరి. ఎట్లని నేఁ బ్రశ్నింపఁగా మనసు కుదిరినపుడు మార్గముల కేమికొదువ యనియును, నీతి దుర్నీతులు పట్టి భ్రమ యనియును, పాపముచేయని మనుజు లీప్రపంచమున మచ్చునకైనఁ గానరారనియును, వారు వేదాంతోపన్యాసములు గావించిరి! వారి మాటల సారమును, మొదలియారి యుద్దేశమును నా కిపుడు విస్పష్టమయ్యెను: నాశరీర మమ్ముకొనియె నేను సొమ్ము గడింపవలయునని!

"ఈసంగతి గ్రహించిన కొన్ని దినములవఱకును, నాకు మొదలియారిమీఁదఁ జెప్ప నలవిగాని కోపము జనించెను. నాబస కారోజులలో తఱచు రాకుండుట వలననే, వాని మరియాద నిలచినది! కాని, పట్టి కోపము

వలని ప్రయోజనమేమి? 'అమ్మా! మార్గము చూపుమంటిరి గాన, నాకుఁ దోఁచినపద్ధతి నే సూచించితిని. ఇఁక మీ యిష్టము! ఒకడు రెండురోజులలో నాసొమ్మియ కున్న, మీమాట దక్కదు!' అని యొకనాఁడు కఠినముగఁ బలికి, యతఁడు వెడలిపోయెను.

"నే నేమిచేయను? ఊరక వీనిమీఁదఁ గోపించిన లాభమేమి? ముందేరీతిని దినములు గడిపెదమనుకొన్నను? వెంటనే ఋణవిముక్తను గావలయునుగదా! కాని, నేనెట్టి యిక్కట్టులు పడవలసివచ్చినను, తుదకు ప్రాణములు కోలుపోనున్నను, ఒరులకు నామాన మర్పింప నొడంబడలేదు!

౨

"సముద్రతీరమందలి వీథిలోని యొక పాడింటికి మొదలియారంత నన్నుఁ గొనిపోయెను. అందొక గది నాకిచ్చి, పశుప్రవృత్తిని పొట్టపోసికొని, తన యప్పు దీర్చివేయుమని నన్ను తొందరపెట్టెను. ఆయింటఁ దక్కిన గదులలో, వీఁడుచేర్చిన నావంటి బానిసలె మఱికొంద ఱీ యధమాధమవృత్తితో జీవములు నిలుపఁబెట్టుకొనుచున్నారు. అతి నీచమును, దుఃఖభాజనమును నగు బ్రతుకనిన నెంతయో రోఁత గలిగియే వీరు బ్రతుకుచున్నారు! ఇట్టి కష్టజీవితముకంటె మృత్యువె మేలని యెంచుచున్నారు. కాని, యెన్నిరోగములతోఁ గృశించుచున్నను, ఎట్టిబాములకు లోనగుచున్నను, మాయదైవము వారికి మృత్యువును బ్రసాదింపక, వారిపట్ల క్రౌర్యమును బూనియున్నాఁడు!

"ప్రాణము పోవుటకైన నేను సమ్మతింతునుకాని, యిట్టి నీచవృత్తికి నే నొడంబడనని మొదలియారుతో నేఁ జెప్పివేసితిని. నేను చిన్ననాఁటనుండియు, అప్పములు మొదలగు నల్పాహారములు చేయుటయం దారితేఱితిని. నే జేసిన దోసె లతి రుచ్యములని శత్రువగు సవతితల్లియు ననుచుండును. ఇపుడు తినుబండములు చేసి యమ్మి, దానివలన వచ్చిన లాభముతోఁ దన ఋణమిచ్చివేయుదునని నేను మొదలియారుతో విన్నవించితిని. ఈ పద్ధతి వానికి మొదట బొత్తిగ నిష్టము గాకున్నను, నేను పట్టినపట్టు విడువకుండుటవలన, చేయునదేమియు లేక వాఁడు సమ్మతించెను. ఈ రెండు మూఁడు సంవత్సరములనుండియు నేనచటనే కాపురముండి, చిఱుఁదిండి వస్తువులు చేసి యమ్ముచుఁ గాలక్షేపము చేయుచున్నాను. చెడిపలుండెడి యాచోటునఁ గాక వేఱొక ప్రదేశమున నేను నివసించి, నాపనులు చక్కఁబెట్టుకొనుచు, తన బాకి యిచ్చివేయుదునని నే నెంతచెప్పినను, మొదల్యారు సమ్మతింపలేదు. అందఱికి నన్ని విడిదలు కుదర్చలేనని యాతఁడు చెప్పివేసెను! ఆతని నిర్బంధములకు నేనెటులో యోర్చుకొని, యచటనే పనులు చేసికొని జీవించుచున్నాను.


"కాని, గాజులబేరము భోజనమునకుఁ జాలదు! నాకు వచ్చిన కొంచెము సొమ్మును ఎప్పటికప్పుడె నేను వాని చేతులలోఁ బోయవలయును! మిగిలిన బాకి తీర్చివేయుమని యతఁడు నిరతము నన్ను బాధించుచుండును. మాకందఱికిని దా నేర్పఱచిన చెఱసాలవంటి యీయిల్లు మే మెన్నఁడును దాటిపోకుండ నిందు నౌకరులను గాపుపెట్టినాఁడు. అనుదినమును దా నక్కడకు వచ్చి మా జాడలు కనిపెట్టుచుండును. ఎక్కడకుఁ బోవుటకును, ఏమిచేయుటకును, మాకు స్వతంత్రములేదు! ప్రాఁతబాకి యను బంధమువైచి, బానిసలవలె మము బాములఁ బెట్టుచున్నాఁడు! అచటి తక్కిన స్త్రీలకంటె మంచిదశనున్నానని నాకేమియు సంతోషములేదు. మొదలియారి లాభమునకై తమదేహము లమ్ముకొని గాసినొందెడి తోడియాఁడుకూఁతుండ్ర కష్టములు గనిపెట్టుచు, నాకన్నులు కాయలుకాచినవి, మనసు మొద్దువాఱినది! దిక్కులేని దానను; పరుల దురవస్థ నెటులఁ బాపఁగలను! మనసులోని దుఃఖము మఱచిపోవుటకై పార్కు వేడుకలు చూడనీయుమని నేను ప్రతిదినమును వేధింపఁగా, ఈనాఁటికి మొదలియారు నన్నిలు కదలనిచ్చినాఁడు! నన్నిచటికిఁ గొనివచ్చి, ఏపనియో చక్కఁబెట్టుకొనుట కెచటికో పోయి, తాను వచ్చువఱకును ఇచటనే యుండుమని నాం కాజ్ఞ నిచ్చి నన్నుఁ గనిపెట్టుటకే, అల్లదిగో, కనఁబడెడి యావండను బెట్టినాఁడు! నాయనా! ఈదురాత్మునిచేతఁ జిక్కుకొన్నాను! నాకేమి దిక్కు!" అనియాస్త్రీ గోలుగోలున నేడ్చి, మరల నాపాదముల కెరఁగెను.

౫

"ఆగంతుకుఁడనగు నేనేమి చేయఁగలను! పరదేశమున నూఱులకొలఁది రూపాయిలు బాకిపడిన యీపరస్త్రీని ఋణవిముక్తనుగఁ జేయవలసిన బాధ్యత నాకేల? ప్రపంచము వివిధవర్తనముల విలసిల్లెడి పాత్రలకు నాట్యరంగము. ఇందలి కష్టములకెల్ల కంటఁగఁబడి క్రుంగువాఁడు, వంచినవీపు నెన్నటికి నెత్తికొననే లేఁడు! "స్త్రీపునర్వివాహ ఖండనము" వ్రాసి వాసికెక్కిన వ్యాసమూర్తి శాస్త్రిలవారి పౌత్రుఁడఁనగు నాకు వితంతూద్వాహపక్షము బాల్యమునుండియు విషతుల్యము! ఇట్టిసందర్భమున, ఏలో నాకుఁదోఁచిన తృణము నామె చేతినుంచి హాయిగ నాదారిని నేబోయెదనని తలంచి, జేబులోనుండి యొకరూపాయతీసి, 'కావేరమ్మా! ఇది తీసికొనుము. దైవము నీమొఱాలకించునులే!" యని యాద నామెగ్గఁ బడవైచి, చేతికఱ్ఱతీసికొని, పయనము సాగింపఁ బూనఁగా "అన్నా, అన్నా! నాకిస్సాహమ్మేల? అదిగో రాక్షసివలెవచ్చెడి మొదలియారినుండి నన్ను దప్పింపనా? నామానప్రాణములను వీఁడే యపహరింపనున్నాఁడు! నీవు కాకున్న నింక నాకెవరు శరణము? ఏమి గతి!" అని దుఃఖావేశముతో నా గంగన నా ముంగల మోకరించెను,

"నే నేమిచేయుదు? అసహాయుఁడనగు నే నీయబలనెట్లు గాతును? దీని దారిద్ర్యము దరిలేనిది! దీని వర్తనము సందేహాస్పదమైనది! కనులకుఁ గనఁబడువారల తలపుండ్లుగనుగ నెవ్వరితరము? ఐనను, నేను దీని రక్షింపనించుకయైనఁ బ్రయత్నింపవలదా? ఒకవేళ, నా స్వల్పసాహాయ్యమునకే యిది తెప్పిరిలఁగలదేమో! మనపరిస్థితులు బాగుగానున్నను పరోపకారకార్యములు బందుకానలయునా? పరులను ప్రకృతపు విపత్తునుండి తప్పింపఁ బూనవలయునే కాని, మనకు తీఁకయగు నంతను ధర్మకార్యమును నిలిపివేయుట యేమి న్యాయము?

"ఇంతలోనె యాపురుషుఁడు మమ్ము సమీపించెను. అతనిఁజూచి కావేరి గజగజ వణకెను. "అన్నా, నన్నుఁ




జేయి విడిచెదవా? ఈ కటికవానికి నన్ను బలియిచ్చెదవా?" అని దుర్భర విషాదమున నామె మరల మరల మొఱలిడెను. దాని దీనాలాపములు నాహృదయమును నీరుచేసెను. ఇట్టి యాపన్నలను గాచుటకుపకరింపని నావిద్యాధనములు వ్యర్థములుగదా! ఈ యబలను గాతునని నే నొక్క ప్రతిజ్ఞతోన నిశ్చయించుకొంటిని. నాకేమి వాటిల్లినను, ఈ యసహాయను సహోదరినిగలెఁ బ్రోచి, నాజీవితమును సార్థకపఱచుకొందును!

౬

మొదలియారు, చేటికయును మమ్ముఁ గలసికొనునప్పటికి, కావేరి నా చొక్కాయి చెంగును వణకుచుండెడి తనచేతఁ బట్టుకొని నాప్రక్క నిలుచుండెను. భయాకంపిత యగు నాకోమలి దేహమున ముచ్చెమటలును పోసెను. సంధ్యాకాలపు సూర్యకిరణము లాసుదతివదనసీమయందలి ఘర్మబిందువులను, క్రొత్తకెంపుల కాంతులతోఁ దళుకొత్తఁ జేయుచుండెను. "నీకువచ్చిన భయము లేదులే!" అని నే నాయబల నూరడించి, మొదలియారుతోఁ బ్రసంగమునకు దొరఁకొంటిని. సాయంసమయమగు చుండుటవలన నందఱమును పార్కునుండి వెడలిపోసాగితిమి. అతని మాటలనుబట్టి కావేరి వాని కేనూఱు

రూపాయలు బాకిపడినది. ఆమె నా చెల్లెలనియును, దానిఋణము నే మెల్లగఁ దీర్చుకొందుననియును, నేను వానితోఁ జెప్పితిని. లోపలి జేబు తడువఁగా, సీమకమలములు కొనిపెట్టుమని భార్య నాకిచ్చిన నూరురూపాయల నోటు అందుఁ గానవచ్చెను. అదితీసివానిచేతినుంచి ఇది దానియప్పు మొదటివాయిదా చెల్లుసొమ్మనియును, త్వరితముగ నే తక్కినడబ్బు పంపుదుననియును జెప్పి, ముద్రితమైన నాచిరునామా వాని కిచ్చితిని. అతఁడవి చూచుకొని సంతోషముతో నాపరతు నంగీకరించుటకు మాఱుగ, తనయప్పు తీరువల కిఁకభయము లేదని గ్రహించి మఱింత బిగిసి, మొగమునెల్లఁ జిట్లించి, తనసొమ్మంతయు వెంటనే చెల్లింపనఁగాని యాయువతిని విడువనని, చీర చెంగుతో నా చేడియను తనవైపు గుంజుకొనెను. "అయ్యో! అన్నా!" అని యాకోమలి కోకకొంగు తప్పించుకొని, నాదెస కడుగిడెను—"నన్నెట్లువిడిచి పోదువో చూతును!" అని యాక్రూరుఁ డంత భయకంపితయైన యాస్త్రీకరము నొడిసిపట్టెను. కోపోద్రేకమందిన నాచేతి బెత్తమంత




వాని వెన్నుమీఁదికి దుమికి, ఎదుటిసత్రపు గోడ మీఁద ప్రతిధ్వనిఁ గావించెను! ఒక నిముసములో మాయిద్దఱిచేతులు కలసెను. చుట్టును మూఁగిన గుంపును వెడలఁగొట్టి, రక్షకభటుఁ డొకఁడు మమ్మిరువుర నంత విడఁదీసెను—ఆదుష్టుఁడు నాసోదరిని కులటాలయమునకు బలాత్కారముగఁ గొనిపోవుచున్నాఁడని నా మొఱ. తన భార్యను తనయింటికిఁ దీసికొనిపోవుచున్నానని మొదలియారి జవాబు. బ్రాహ్మణాంగనయగు తా నాశూద్రుని పతి నెట్లగుదునని యాచాన యడ్డుసవాలు! జేబులోనుండి చివాలున నేనంత తెల్లకాకితముతీసి, పట్టున దాని రెండింటిక్రిందఁ జింపి, పదుపువృత్తిలోనికి దనను దౌర్జన్యమునఁగొని పోవు నీదుండగునుండి తప్పించి తన సోదరుని వశము చేయుమని రక్షకాలయాధిపతికి విన్నపము వ్రాసి, కావేరిచే నందు చేవ్రాలు చేయించి మమ్మమ్మగ్గుని సమీపరక్షకభటాలయమునకుఁ గొనిపొమ్మని యా పోలీసువానిని గోరితిని.

౧౦

ఆతఁడదివఱకే యచటికి దాగి తీయుచుండెను. మేమును వానితో నడచిపోతిమి. వెంటనేయుద్యోగస్థుని కీయుమని యర్జి ని రక్షకభటునిచేత నుంచితిమి. ఐనను, ఆదినము పెద్దయుద్యోగి యచటికి తనిఖీకివచ్చియుండుట చేత, మాసంగతి యెప్పటికిని విచారణమునకు రాలేదు— రక్షకభటులు మమ్మంచలనిగాచుచుండిరి. ఈసంధ్యగాఁ బహుసారులు, మఱియారు భటులతో గుసగుసలు సల్పుచు, తనపంతము నెగ్గునను ధైర్యమున వామీఁద మీసము దువ్వుచుండెను. మేమందఱమును విద్యుద్దీపపు వెలుఁగునఁ గూర్చుండి, ఎన్నటికి దొరగారి తనిఖీసమాప్తమై, మాతనిఖీ యారంభమగునా యని నిరీక్షించుచుంటిమి.

ఎట్టకేలకు, పెద్దదొర పరీక్ష ముగింపు సమయమయ్యెను. భటులలో కదలిక గలిగెను. కాలహరణమేమియుఁ గాకుండ, చిన్న యుద్యోగితో నేను ప్రసంగింపవలెనని ముందు నిలువఁబడితిని. వెడలిపోవుచున్న దొరగారిచూపు, విద్యుద్దీపమున వెలుఁగు నాముఖము మీఁద నంత ప్రసరించెను. ఆయన నెపుడో నే జూచి నట్లు కానవచ్చెను—కాని, మాపని యాయనతోఁగాక, చిన్నయుద్యోగితో నగుటచేత నే నూరకుంటిని. అంత ముందుకు నాలుగడుగులు వేసిన పెద్దయధికారి వెనుకకు

మరలి, నా ముఖమును శోధించి, నా జేబ్బుమీఁద జేయి వేసి, "నీవుటోయిపరబ్రహ్మముపంతులూ!" అని హెచ్చరించెను. "పరాంకుశముపిల్లా!" యని నేనొక గంతువేసి, అతని కరస్పర్శనముఁ జేసితిని. చిన్ననాఁడు కళాశాలలో నా సహాధ్యాయుఁడైన పరాంకుశ మిపుడు బుగ్గమీసములు పెంచి, బావురుఁ బిల్లివలెఁ గానవచ్చెను! ఎవరి యదృష్టము నారిది! అతఁడిపుడు రక్షకశాఖలో నొక గొప్ప యుద్యోగి. నా సమాచారము స్నేహితునికి సంగ్రహముగఁ దెలిపి వానికి వీడ్కోలొనరించితిని. ఎపుడతఁడు వెడలిపోవునా, స్థానికోద్యోగి మా సంగతి యెపుడు విమర్శించునా యని మే మువ్విళులూరుచుంటిమి. "ఈమెయేనా నీచెల్లెలు పంతులూ!" అని యతఁడు కావేరిని సమీపించి, "అమ్మా! పసిపిల్లవకు నీకేనా యింత సంభవించినది!" యని పలికి, "మొదల్యారీ! నీవేనా ఇంత పనిచేసితివి?" అని వానిని సంబోధించెను. "అది కాదండి!" అని చిఱునవ్వుతో మొదలియారు దొరగారి మందహాసమందుకొని, యాయనతో సంభాషింప నభిలషించెను. కాని, మెఱుపులతోఁగూడిన వర్షాకాలపు మేఘము ఆకాశమును గమ్మి గర్జించురీతిని, కోపోద్దీపితమగు నా యుద్యోగి ముఖము ముడతలుపడ, "దండలగాయఁడా! ఎన్నిమాఱులు చెప్పినను నీకు బుద్ధిరాకున్నదే!" అని యాతఁడఱచి, చేతనున్న వెండిపొన్న బెత్తముతో మొదలియారు చేతిమునికట్టు ఖంగున మ్రోఁగునట్టు వేసెను! "ఈబద్మాషును రాత్రి లాకపులోనుంచి, తెల్లవార మేజస్ట్రేటుయొద్ద కేసుపెట్టు!" అని తన తాబేదారున కుత్తరువొసఁగి, నావైపునకుఁ దిరిగి, "పరబ్రహ్మము పంతులూ! నీకు నీ చెల్లెలికి నేఁటిరాత్రి మాయిల్లు విడిది. ప్రొద్దున కేసులో సాక్ష్యముకాఁగానే, నీవు వెళ్లిపోవచ్చును. పబ్లీకు ఉద్యోగివగు నీ సాక్ష్యము వెంటనే పుచ్చుకొందురు లే!" అని దొరచెప్పి, మమ్ములను తన మోటారులోఁ గొనిపోవ సమకట్టెను. కాని, కొన్ని జరూరుపను లుండుటచేత, నే నానాఁడే రెయిలులో పోవలెనని చెప్పి, మెత్తపడిన వానివలె నా కిటీవలఁ గను సైగలఁ జేయు మొదలియారుతోఁ గొన్ని మాటలాడ ననుజ్ఞ వేడితిని. ఆ దుష్టునితో నింక ప్రసంగముచేయ వలదని నామిత్రుఁడు వారించుచున్నను, నేను మొదలియారిని సమీపించితిని. ఇపు డాతఁడు గుఱ్ఱము దిగియున్నాఁడు! తనకును కావేరికిని సంబంధించిన కాకితము లన్నియు వాఁడు నాముందు వైచి, "ఇవి యన్నియు చెల్లువేసి యిచ్చెదను. మీ రిదివఱ కిచ్చెదమనిన నూఱు





రూపాయిలు నా కిప్పించండి. ఇఁకముందు కావేరికి నాకు నెట్టి తగాదాలు నుండవు!" అని మొదలియారు చెప్పివేసెను. ఆ దుర్మార్గునితో రాజీ వలదనియు, అట్టి వారలను క్రమముగ శిక్షింపించుటయే తోడి ప్రభుత్వోద్యోగివగు నాకుఁ గర్తవ్యమనియు, పరాంకుశముపిల్ల హెచ్చరించుచున్నను, సామోపాయమునకే నా మనసు మరలి, మొదలియారితోడి సంధి కొడంబడితిని. ముందు బుద్ధిగలిగి మసలెదనని వాగ్దానముచేసిన మొదలియారంతి నాసమ్మతిని విడుదలయయ్యెను. అన్నచెల్లెల మిరువురము ను పిళ్లగారికి కృతజ్ఞతాపూర్వకవందనము లర్పించి, అపుడే వెడల నున్న యుత్తరాదిరెయిలుబండిలోఁ గూర్చుంటిమి.

౧౧

రెయిలందుటకును, పైబల్లమీఁద పడకకు తావు దొరకుటకును నేను సంతోషించి, నాఁటిసంగతులు విమర్శనముచేసికొనుచుంటిని. కావేరియు కొందఱు స్త్రీలును

చెప్పుకొనుమాటలు క్రిందనుండి నావీనులకుఁ దట్టుచుండెను. దిక్కుమాలిన యీస్త్రీని మాయింటికిఁ గొనిపోయి, దీనిని నాథునియొద్దకుఁ జేర్చుభారమెట్లు నిర్వహింతునాయని తలపోయుచు, కదలుచున్న బండివేగమున వీచుగాలి కట్టెకునికితిని. వాయువేగమునఁ బోవునొక మోటారెక్కి, మమ్మువెన్నంటు శత్రువుల బారినుండి మేముతప్పించుకొనుచుండునట్లును, ఇంతలో నొకపొదలోనుండిదుష్టుఁడు వేలు మొదలి బయలువెడలి, యమాంత్రముగ కావేరినిబట్టి యీడ్చుచుండఁగా, రక్షింపుమని వన్నామె వేడినట్లును నాకు కలవచ్చెను. ఉలికిపడి నేనంత పడకనుండి లేచి చూచితిని. కావేరి నన్నిపుడు పలుకరించుచుండుట వాస్తవమె. తానాస్త్రీలతో లోకాభి రామాయణము మాటాడుకొనుచు, సందర్భానుసారముగఁ దనసంగతి ప్రస్తావించి వనటఁ జెందఁగా, అచటి స్త్రీయొకతె తనపెనిమిటి జాడలు కొంత బయలుపఱచెననియును, ఆతఁడిపుడు బెజవాడలో కాఫీశాలపెట్టినట్లు తెలిసిన దనియును కావేరి చెప్పెను. నేనంత యాస్త్రీ నింకను బ్రశ్నించి, మఱికొన్నిసంగతులు తెలిసికొంటిని. ఇది యంతయు శుభసూచకమెగదా. విశాఖపట్టణము పోక ముందె, మార్గమధ్యమున నేను బెజవాడలోదిగి, కావేరి కాపురముకుదుటపడుటను గుఱించి ప్రయత్నింపఁదలంచుకొంటిని.

బెజవాడలోని కాఫీశాలలు మేము వెదకితిమి. కావేరి పెనిమిటి జాడలు మాకుఁ గానఁబడలేదు. చాల ప్రొద్దెక్కినది. ఒకపెద్దకాఫీశాల ముఖద్వారమున నేను నిలచితిని. లోనికిఁబోయి చూచివత్తునని కావేరి పెరటి దారినిపోయెను. అస్తమయమగుటచేత, వాకటిలో నెవరును లేదు. పెరటిలో నేదో ఘర్షణజరుగుచున్నట్లు వినఁబడి, నేను నచటికిఁబోతిని. పతి నిన్నాళ్లకుఁ జూచితినిగదా యని పట్టరాని యానందమున కావేరి యాయన చరణములయొద్ద మూర్ఛిల్లెను. చల్లనినీరు మోమునఁ జల్లగ నాసుదతి తెప్పరిల్లియు, పతిపాదములుపట్టి విడువకుండెను! చుట్టునుండుస్త్రీలామె పాతివ్రత్యమును ప్రశంసించిరి. ఇంతలో నేను సమీపమునకుఁ బోయి చూచితిని. బెజవాడలో పెద్దకాఫీశాలనడపు నీతఁడు నాకుఁబరిచయుఁడే. నాకతఁడునమస్కరింపఁగా, "ఏమి విశ్వనాథము! బాగాచేసినావులే! అనువ్రతయగు సతిని మితిలేని వెతలు పాలుచేసితివే!" యని వానిని దెప్పితిని. ఆనందాశ్రువు లొలుకుచుండ విశ్వనాథ మంత తన వృత్తాంతము మాకువినిపించెను. ఈతఁడు మంచివాఁడు. ఎక్కువరాఁబడికొఱకు కన్నిప్రదేశములలో పోయిచూచి, తుదకీ బెజవాడలో సొంతకాఫీశాలస్థాపించి, భార్య నిచటికిఁ గొనివచ్చుతలంపుతో రాజమహేంద్రవరముపోయి, ఆమె జాడలచటనెందును గానరాక, నిరుత్సాహుఁడై మరలివచ్చెను. త్వరితముగ భర్త యింటికి రాలేదని భార్య తొందరపడి విదేశముల కేగినను, ఆమెయందే తా నధికానురాగము గలిగియుంటినని విశ్వనాథము చెప్పి, తనకాఫీశాల పేరు "కావేరీ కాఫీశాల" యగుటయే దీనికి నిదర్శనమనిపలికినపుడు కంటఁ దడిపెట్టని వారచట లేకుండిరి! కావేరి కాఁపురమిట్లు కుదుటఁబడుటకు సంతసిల్లి, తనసేమము తఱుచుగఁ దెలుపుచుండుమని చెల్లెలిచే వాగ్దానముపడసి, క్రొత్తబంధువుల వీడ్కోలుగైకొని, నేఁడేఁటేన మనసుతోఁ బంద్రెండు గంటల బండి నందుకొంటిని.




"కావేరి యాయనచరణములయొద్ద మూర్ఛిల్లెను."